



ఆయిల్ ఫ్యాక్టరీని సీజ్ చేసిన అధికారులు



ప్రమాదం జరిగిన ఆయిల్ ట్యాంక్ ఇదే..

ఆయువు తీసిన ఆయిల్ ఫ్యాక్టరీ

- ట్యాంకును శుభ్రం చేసేందుకు దిగిన కార్మికులు
- ఊపిరి ఆడక ఏడుగురు మృతి
- జి.రాగంపేట అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ పరిశ్రమలో ఘటన
- మృతులు పాడేరు, పులిమేరు వాసులు

వారంతా రెక్కాడితేనే గాని డొక్కాడని కార్మికులు. కుటుంబాల పోషణ కోసం తక్కువ వేతనాలే అయినా తెలియని పని అయినప్పటికీ పరిశ్రమలో పని చేసేందుకు వచ్చారు. ఫ్యాక్టరీలో చేరి పట్టుమని పదిరోజులు కాలేదు... పని కూడా పూర్తిగా తెలీదు.. వారి అమాయకత్వాన్ని యాజమాన్యం ఆసరాగా చేసుకుంది. భద్రతా ప్రమాణాలు పాటించి నిపుణులు చేయాల్సిన పనిని వారితో చేయించింది. తిరిగి రాని లోకాలకు పంపేసింది. ఆ వలస పక్షుల కుటుంబాల్లో తీరని వేదనను నింపింది కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలోని అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం.



విగత జీవులుగా మారిన కార్మికులు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, సామర్లకోట, సామర్లకోట రూరల్, కాకినాడ

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలో ఉన్న అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్ ట్యాంకును శుభ్రం చేయడానికి దిగిన ఏడుగురు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలానికి చెందిన వారు కాగా పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన మరో ఇద్దరు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో 30 అడుగుల ఎత్తున ఉన్న క్రూడ్ ఆయిల్ ట్యాంకర్‌ను శుభ్రం చేసేందుకు దిగారు. ఆ సమయంలో పరిశ్రమ యాజమాన్యం ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించలేదు. ఫలితంగా పాడేరు మండలం పర్రెడ పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెచ్చింగి కృష్ణ (35), వెచ్చింగి నరసింహ(38) వెచ్చింగి సాగర్(20), వంచెడిపుట్టు గ్రామానికి చెందిన కుర్తాడి బొంజుబాబు(30), బొండాపల్లికి చెందిన ఈదులమెట్ట గ్రామ నివాసి కొర్ర రామారావు(42), పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన యల్లమిల్లి దుర్గాప్రసాద్ (28), కట్టమూరి జగదీష్(25) మరణించారు. వీరంతా ఉపాధి కోసం పొట్ట చేతబట్టుకుని వచ్చిన వలస కూలీలు.

ఉపాధి లేక వలస వచ్చి...

గిరిజన గ్రామాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పాడేరు మండలానికి చెందిన 10 మంది గిరిజనులు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతున్నారు. సంఘటన జరిగిన ప్రాంతంలో తమకు ఎవరూ జాగ్రత్తలు చెప్పలేదని, మిషన్‌లో నువ్వులు వేసి ఆడించడమే తమకు తెలిసిన పని, అయినా ట్యాంకులోకి దిగి పనులు చేయించారని అక్కడే ఉన్న తోటి వలస కార్మికులు భాస్కర్, బాలరాజు తెలిపారు. పది రోజుల క్రితమే ఇక్కడకు పనికి వచ్చామన్నారు. మృతుల్లో కొర్ర రామారావుకు భార్య, 8 మంది పిల్లలు, నరసింహకు భార్య, నలుగురు పిల్లలు, కృష్ణకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. సాగర్‌కు ఇంకా వివాహం కాలేదు. కృష్ణ కూతురు పవిత్ర విశాఖపట్నంలో నర్సింగ్ చదువుతోంది. ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేక ఈ పనికి వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

సిఐటియు ఆధ్వర్యంలో బంధువుల ఆందోళన

మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పులిమేరుకు చెందిన మృతుల బంధువులు ఆందోళనకు దిగారు. పరిశ్రమ వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజకుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిఐటియు జిల్లా నాయకుడు డి.క్రాంతికుమార్ తదితరులు మాట్లాడారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. మతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి తదితరులు బాధితులకు మద్దతుగా నిలిచారు. అనుమతులు లేని పరిశ్రమ కార్యకలాపాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం

ప్రభుత్వం తరఫున ఒక్కో మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందించనున్నట్లు సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికశుక్లా తెలిపారు. అనంతరం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎంఎల్ఎ చిన్నరాజప్ప, ఆర్‌డిఒ జె.సీతారామరాజు, తహశీల్దార్ జితేంద్ర, అరకు ఎంపి భర్త గొడ్డేటి శివప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజకుమార్ ఇతర నాయకుల పరిశ్రమ యాజమాన్యంతో సుమారు 2 గంటల పాటు చర్చలు జరిపారు. ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియాతో పాటు మరో రూ.25 లక్షలు 15 రోజుల్లో చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. అర్హత మేరకు వితంతు పెన్షన్, ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఫ్యాక్టరీలో మృతుల కుటుంబీకుల్లో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం, తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చెల్లించేందుకు ప్రజా ప్రతినిధులు, కార్మిక సంఘం నాయకుల సమక్షంలో యాజమాన్యం ఒప్పంద పత్రాలను రాసి ఇచ్చింది.. సంబంధిత బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం : మంత్రి వేణు

జి.రాగంపేటలో ఆయిల్ ప్యాకేజీ కంపెనీ ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక జిజిహెచ్‌లో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ప్రమాదంపై సిఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. తక్షణమే స్పందించి ప్రభుత్వ సహాయంగా రూ.25 లక్షలు ప్రకటించారన్నారు. కంపెనీ తరఫున మరో రూ.25 లక్షలు బాధితులకు అందుతుందని తెలిపారు. ఘటనపై ప్రత్యేక కమిటీ వేశారని, మూడు రోజుల్లో సమగ్ర విచారణ జరిపి, నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. లోపాలు ఏవైనా ఉంటే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఫ్యాక్టరీ సీజ్

ఏడుగురు కార్మికులు మృతి చెందడంతో జి.రాగంపేటలోని అంబటి సుబ్బయ్య అండ్ కో ఆయిల్ ఫ్యాక్టరీని కాకినాడ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి రాధాకృష్ణన్, సామర్లకోట ఎస్ఐ సునీత ఆధ్వర్యంలో ఫ్యాక్టరీని సీజ్ చేశారు. దర్యాప్తు అనంతరం చర్యలు ఉంటాయని వారు ఈ సందర్భంగా తెలిపారు.

కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

ఆయిల్ ఫ్యాక్టరీ మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. కార్మికుల మరణానికి కారణమైన ఆయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలన్నారు. ఇటీవల కాలంలో పరిశ్రమల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవట్లేదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు.

మిన్నంటిన రోదనలు



ఫ్యాక్టరీ వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనల మిన్నంటాయి. విగత జీవులుగా పడి ఉన్న మృతదేహాలను చూసి విలపిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. దుర్గాప్రసాద్, జగదీష్ ఇరువురూ అందరితో కలిసిమెలిసి వుండేవారని పులిమేరు గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. దుర్గాప్రసాద్‌కు పిఠాపురం మండలం కొండెవరం గ్రామానికి చెందిన సత్యాతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఎనిమిదో నెల గర్భిణి. రెండు రోజుల క్రితమే కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న ఆమె ఫ్యాక్టరీకి చేరుకుంది. 'నాకు దిక్కెవరు?' అంటూ రోదిస్తున్న తీరు అందర్నీ కలిచివేసింది. ప్రసాద్ మృతదేహాన్ని చూసి సోదరుడు వినయ్, తల్లిదండ్రుల వెంకటలక్ష్మి, నూకరాజు తీవ్ర స్థాయిలో రోదిస్తున్నారు. వారి ఆపడం ఎవరితరమూ కాలేదు. మరో మృతుడు జగదీష్‌కు ఇటీవలే వివాహం నిశ్చయమైంది. దిక్కు మొక్కు లేకుండా పడి ఉన్న జగదీష్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు లక్ష్మి, పైడిరాజు, సోదరి మనీషా బోరున విలపిస్తున్నారు.

మెనూ సక్రమంగా అందించాలి

ఆత్రేయపురం : మధ్యాహ్న భోజన పథకంలో మెనూను సక్రమంగా అందించాలని ఎంఇఒ వరప్రసాదరావు ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. గురువారం మెర్లపాలెం హై స్కూల్ మెయిన్ పాఠశాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించారు. రాజవరం మెయిన్ హై స్కూల్‌ను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచన ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఐ.పోలవరం : మురమళ్ల 11కెవి సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డబ్ల్యూఎస్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు అమలాపురం డివిజినల్ ఇఇ మోకా రవికుమార్ తెలిపారు. కేశనకుర్రు, మురమళ్ల, కొమరగిరి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

గొల్లవిల్లిలో శానిటేషన్ పనులు

ఉప్పలగుప్తం : గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో దోమల నివారణకు గురువారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో ముమ్మరంగా శానిటేషన్ పనులన నిర్వహించారు. ఇందిరా నగర్, అశోక్ నగర్, అంబేద్కర్ నగర్ దళిత వాడల్లో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. ఆమె వెంట వైసిపి నాయకులు బి.అబ్బులు, చప్పిడి వెంకటేశ్వర రావు, దుర్గారావు, జి.చిన్ని, పంచాయతీ కార్యదర్శి సాయిబాబు, సిబ్బంది ఉన్నారు.

కార్టూ'నిజం'



ఇసుక కొరత లేకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో డిమాండ్‌కు అనుగుణంగా ఎటువంటి కొరత లేకుండా ఇసుకను సరఫరా చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులకు సూచించారు . గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 17 ఇసుక రీచ్‌ల ద్వారా నెలకు 8వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా అవుతుందన్నారు. జిల్లాలో మూడు చోట్ల ఇసుక డిపోలను ప్రతిపాదించామన్నారు. వీటిలో అల్లవరం మండలం బోడసకుర్రు, ఆలమూరు, రాజోలు ఉన్నాయన్నారు. ఈనెల 15 నుంచి జెపి వెంచర్ వారు జిల్లాలో ఇసుక నిల్వలు చేస్తారన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 14 రీచ్‌లకు అనుమతులు ఇచ్చామన్నారు. వీటిలో 12 రీచ్‌లకు మైనింగ్ ప్లాన్ ఇచ్చామన్నారు. ఏడు రీచ్‌లకు పర్యావరణ అనుమతులు, మూడు రీచ్‌లకు ఇతర అనుమతులు రావాల్సిందన్నారు. నూతనంగా కొండకుదురు, కె.ముంజవరం, వాకలగరువు లంక, బోడసకుర్రు, గోపాలపురం, జొన్నాడ, జొన్నాడ-2, కామరాజులంక, కేదార్లంకలో రీచ్‌లను గుర్తించి పర్యావరణ అనుమతులు ఇచ్చామన్నారు. మిగిలిన అనుమతులు జేపీ వెంచర్ వారు తెచ్చుకోవాలని సూచించారు. వచ్చే నెల 22 రీచుల్లో 17 రీచ్‌లకు గడవు ముగియనుందన్నారు. వీటిని గుర్తించి అనుమతులు కోరాలని మైనింగ్ అధికారులకు సూచించారు. రామచంద్రపురం, కె.గంగవరంలో ఇసుకరీచ్‌లను ఎంపిక చేయాలన్నారు. బోట్స్ మెన్ అసోసియేషన్ ద్వారా కూడా త్వరితగతిన ఇసుక సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖనిజాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు పి.నరసింహారెడ్డి, సహాయ సంచాలకులు విష్ణువర్ధన్‌రావు, కమిటీ సభ్యులు ఎఎస్‌పి లతామాధురి, జిల్లా రవాణా అధికారి అశోక్‌ప్రతాప్‌రావు, ఆర్‌డిఒలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



మార్చి 21 వరకూ ఎన్నికల కోడ్

ప్రజాశక్తి - అమలాపురం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికల నగారా మోగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి స్థానిక అథారిటీస్ స్థానం నుంచి శాసన మండలికి సభ్యులుగా ఎన్నికైన చిక్కాల రామచంద్రరావు పదవీ కాలం ఈ ఏడాది మే ఒకటో తేదీముగియనుంది. ఈ స్థానంలో ఎన్నిక కోసం భారత ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల 9వ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ జారీ అవుతుంది. ఈనెల 23వరకూ నామినేషన్లను స్వీకరించనున్నారు. 24న నామినేషన్ల స్క్రూట్నీ జరుగుతుంది. 27వరకూ నామినేషన్ల ఉప సంహారణకు గడువుగా పేర్కొన్నారు. మార్చి 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మార్చి 16న ఎన్నికల ఓట్లు కౌంటింగ్ జరుగుతుంది. మార్చి 21తో ఎన్నిక నోటిఫికేషన్ పూర్తవుతుంది. అప్పటి వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఆత్రేయపురం : వెలిచేరు శివారు నిర్వహిస్తున్న పేకాట శిబిరంలోపై ఎస్ఐ సిహెచ్.సుధాకర్ తన సిబ్బందితో గురువార దాడి చేశారు. ఇద్దర్ని అదుపులోకి తీసుకు న్నారు. వారి నుంచి రూ.3,700 స్వాధీనం చేసకుని కేసు నమోదు చేశారు.

ఏడిద రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందనలి

మండపేట : కొంతకాలంగా పాడైపోయి అధ్వాన స్థితికి చేరుకున్న మండపేట ఏడిద రోడ్డుకు ఎట్టకేలక మోక్షం లభించింది. రోడ్డు భవనాల శాఖ అధికారులు రూ.49 లక్షలతో మరమ్మత్తు పనులు చేపట్టారు. రోడ్డు దుస్థితిపై ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం రోడ్డు పనులను అధికారులు పర్యవేక్షించారు. మరమ్మతులతో కొంత మేర ప్రయాణికులకు పాట్లు తగ్గనున్నాయి. మరో పది రోజుల్లో రోడ్డు మరమ్మతు పనులు పూర్తి చేస్తామని జెఇ సూర్యనారాయణ తెలిపారు.

రాంబాబు కుటుంబానికి ఎంఎల్‌సి తోట పరామర్శ

మండపేట : ఇటీవల అనారోగ్యంతో మరణించిన 6వ వార్డుకు చెందిన వైసిపి కార్యకర్త మోటుపల్లి రాంబాబు కుటుంబాన్ని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి గురువారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కౌన్సిలర్లు మెండు బాపిరాజు, గ్రంధి శ్రీనివాసు, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, వైసిపి నాయకులు సాధనాల శివ భగవాన్, శెట్టి నాగేశ్వరరావు, పులగం శ్రీనివాసు ఉన్నారు.

డాక్టర్ భానుప్రసాద్ దంపతులకు సత్కారం

ఆలమూరు : ఇటీవల జాతీయ సమైక్యత అవార్డును అందుకున్న పెనికేరు గ్రామ పశువైద్యులు డాక్టర్ డి.భానుప్రసాద్ దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి హాజరయ్యారు. డాక్టర్ దంపతులకు ఆయన దుశ్శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగమోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ తాడి ఆదిత్యరెడ్డి, మాజీ సర్పంచ్ దొరబాబు, పశువైద్య శాఖ ఎడి డాక్టర్ ఎల్.అనిత, డాక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రమణారావు ఆర్థిక సాయం

అమలాపురం : అల్లవరం మండలంలోని అరవచెరువుకు చెందిన ఆర్‌ఎంపి వైద్యుడు పోతుమూడి శ్రీను ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలువిరిగి ఇంటి వద్దే ఉంటున్నారు. వైసిపి అమలాపురం నియోజకవర్గ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆయన్ని గురువారం పరామర్శించారు. చికిత్స నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట పంచాయతీ వార్డు సభ్యుడు జయప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, పరమట రాజేష్, పోతుమూడి అభి తదితరులున్నారు.

ఆధార్ కేంద్రాల పరిశీలన

ఉప్పలగుప్తం : గొల్లవిల్లి సిఎస్ఎం జూనియర్, ఎంఎస్ఎస్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను డిఎల్‌డిఒ కెవి.థామస్ గురువారం పరిశీలించారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎంఎల్ఎన్.మూర్తి, పంచాయతీ కార్యదర్శి పరమట సాయిబాబు, జొన్నాడ చిన్ని ఉన్నారు.అలాగే భీమనపల్లి జగనన్న లేఅవుట్‌ను ఎంపిడిఒ కెఎస్.గౌరీకుమారితో కలిసి ఆయన పరిశీలించారు.

సిఎంను కలిసిన ఎంఎల్ఎ పొన్నాడ

ముమ్మిడివరం : అమరావతిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పెనుమత్స చిట్టిరాజు, కమిడి ప్రవీణ్‌కుమార్, పెయ్యల చిట్టిబాబు, నల్లా నరసింహమూర్తి, ఢిల్లీ నారాయణ, దున్నా జనార్ధన రావు, కాశి లక్ష్మణస్వామి ఉన్నారు.

ఆయాలకు నియామకపత్రాల అందజేత

మండపేట : నూతనంగా నియమితులైన అంగన్‌వాడీ ఆయాలకు ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు గురువారం నియామకపత్రాలను అందించారు.ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. కపిలేశ్వరపురం, రాయవరం ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కొత్తగా నియమితులైన 9 మందికి విజయలక్ష్మినగర్‌లోని తన కార్యాలయంలో తోట నియామక పత్రాలను అందజేశారు.

స్టాక్‌లో తేడాలుంటే చర్యలు తప్పవు

ఆలమూరు : ఎరువుల స్టాక్‌లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు తప్పవని ఎడిఎ షామ్మి హెచ్చరించారు. మండలంలోని అన్ని పిఎసిఎస్‌లు, ఫెర్టిలైజర్ షాప్‌లను ఎఒలు బి.రవి, ఎస్.లక్ష్మిలావణ్యలతో కలిసి ఆయన గురువారం తనిఖీ చేశారు. వ్యత్యాసాలున్న షాపుల యజమానులకు నోటీసులు ఇచారు.

యాత్రికుల సౌకర్యాల కల్పన కృషి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రాష్ట్రంలోని దేవాలయాలకు వచ్చే యాత్రికుల సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని ర్యాలిలో గోపాలస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. నూతనంగా ప్రారంభించిన ఆన్‌లైన్ టిక్కెట్ల విధానాన్ని పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం సౌకర్యాలపై ఇఒ కృష్ణచైతన్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు అభివృద్ధి పనులు, అన్నదానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఇఒ ఆయనకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి ఫోటో, చరిత్ర పుస్తకం అందించారు.

హనుమంతరావు నేత్రాలు దానం

రామచంద్రపురం : కె.గంగవరం గ్రామంలో తొలి వ్యాపారవేత్త గంగాపాత్రుల హనుమంతరావు.(70) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. గురువారం ఆయన మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాకినాడ బాదం బాలకష్ణ ఐ బ్యాంక్ సభ్యులు హనుమంతరావు నేత్రాలు సేకరించారు. ఆయన మతికి సంతాపంగా గ్రామంలో వ్యాపారులు షాప్‌లను మూసివేశారు.

ఏడిద అభివృద్ధికి కృషి : ఎంఎల్‌సి తోట

మండపేట : ఏడిద గ్రామాభివృద్ధికి తన వంతు కషి చేస్తానని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు తెలిపారు. గురువారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగింది. ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాసు, కురుపూడి భవాని, రాంబాబు, సొసైటీ చైర్ పర్సన్‌లు రామిశెట్టి శ్రీహరి, గ్రామ వైసీపీ నాయకులు పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు. వారి వెంట ఎంపిడిఒ ఐదం రాజు, పంచాయతీ కార్యదర్శి యు.వీర్రాజు, యానిమేటర్లు ఉన్నారు.

అరుణకుమారి దంపతులకు సన్మానం

అమలాపురం రూరల్ : ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు పొందిన కామనగరువు సర్పంచ్ నక్కా అరుణకుమారి దంపతులను ఉపసర్పంచ్ రాజలపూడి భాస్కరరావు అధ్యక్షతన పాలక వర్గ సభ్యులు సమక్షంలో గురువారం ఘనంగా సన్మానించారు. జడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంఎల్ఎ దాట్ల పుట్టినరోజు

ఐ పోలవరం : ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ దాట్ల బుచ్చిబాబు పుట్టిన రోజుకు గురువారం మురమళ్లలో ఆయన స్వగృహం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ నలు మూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణుల మధ్య ఆయన పుట్టినరోజు కేకును కట్ చేశారు. మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గంటి హరీష్ మాథూర్, సాగి సూరిబాబురాజు, టిడిపి మండల అధ్యక్షులు నీలకంఠేశ్వరరావు, నాయకులు పాలొగన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

రామచంద్రపురం : ఏడుగురు కార్మికుల మరణానికి కారణమైన ఆయిల్ మిల్లు యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పిడిఎస్‌యు, ఎఐకెఎంఎస్, ఇఫ్టూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల మృతికి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు బి.సిద్దూ, ఎఐకెఎంఎస్ నాయకులు జి.సూరిబాబు సంతాపం తెలిపారు.



భర్త, పిల్లలతో మాణిక్యాలమ్మ

రేషన్ బియ్యం ఇప్పించండి సారూ...

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కుటుంబ పోషణ కష్టంగా ఉంది రేషన్ బియ్యం ఇప్పించండి సారూ.. అంటూ మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని తుపాకుల మాణిక్యాలమ్మ కలెక్టర్‌ను వేడుకుంటోంది. మాణిక్యాలమ్మకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త అనారోగ్యానికి గురవ్వడంతో పోషణ భారం ఆమెపై పడింది. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యంపైనే పూర్తిగా ఆధారపడింది. ఆమెకు రేషన్ కార్డు ఉన్నప్పటికీ ఈ కార్డులో ఉందుర్తి బాబు అనే పేరు అదనంగా యాడ్ అయ్యింది. దీంతో ఉందుర్తి బాబు ముందుగానే వెళ్లి రేషన్ తీసేసుకుంటున్నాడు. దీంతో ఆరు నెలలుగా మాణిక్యాలమ్మకు రేషన్ అందడం లేదు. ఈ విషయాన్ని ఏడో వార్డు వాలంటీర్, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లింది. అయినా సమస్య పరిష్కరించలేదని తెలిపింది. ఈ నెల కూడా రేషన్ కోసం వెళ్తే ముందుగానే బియ్యం తీసుకున్నారని చెప్పారన్నారు. దీనిపై సిపిఎం నాయకులు జి.దుర్గాప్రసాద్ దృష్టికి ఆమె సమస్యను తీసుకెళ్లింది. ఆయన విఆర్ఒ, తహశీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరించాల్సిందిపోయి ముందుగానే వెళ్లి రేషన్ తీస్కోమనండి అంటూ ఉచిత సలహా ఇచ్చారని దుర్గాప్రసాద్ తెలిపారు. ఏ సమస్య వచ్చినా వాలంటీర్‌కు చెప్తే ఐదు నిమిషాల్లో వచ్చి పరిష్కరిస్తారంటూ నాయకులు, అధికారులు చెబుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో ఎవరూ స్పందించట్లేదని విమర్శించారు. నిర్లక్ష్యం వహించిన తహశీల్దార్‌పై చర్యలు తీసుకుని బాధితురాలికి రేషన్ అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - గండేపల్లి

మల్లేపల్లి గ్రామానికి చెందిన రావుల భూలక్ష్మి అనే వృద్ధురాలు ఇంటికి గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక వ్యక్తి వచ్చి మంచినీళ్లు ఇమ్మని అడిగాడు.. భూలక్ష్మి గదిలో నుంచి మంచినీళ్లు తీసుకుని వచ్చి ఆ వ్యక్తికి ఇచ్చింది. ఆ వ్యక్తి మంచినీళ్లు తాగి మెడలో ఉన్న సుమారు రెండు కాసుల బంగారపు గొలుసును తెంపుకొని పరరయ్యాడని భూలక్ష్మి ఘొల్లుమంది. ఆ వ్యక్తి మోటార్ సైకిల్ పై వచ్చాడు అని స్థానికులు తెలుపుతున్నారు ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మండలంలో అనేక చోట్ల చోరీలు అధికంగా జరుగుతున్నాయని దానిపై తాము ఎంతగానో భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు దీనిపై పోలీసులు నిఘా పెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - ధవళేశ్వరం

ధవళేశ్వరంలోని స్థానిక సంజయ్ నగర్‌లో ఉంటున్న అడపా కనకదుర్గ ఇంటిలో ఒక మహిళ బంగారపు గొలుసు చోరీ చేసింది. ఉదయం 11:30 గంటల సమయంలో కనకదుర్గ పడుకుని ఉండగా మెలుకువ వచ్చి చూసేసరికి ఒక మహిళ ఇంట్లో టివి పక్కన కబోర్డ్‌లో పెట్టిన స్టీల్ బాక్స్‌లో ఉన్న ఐదు కాసుల బంగారు సూత్రాల తాడు పట్టుకుని పారిపోతుండగా గట్టిగా కేకలు వేసింది. ఆమె తప్పించుకుని పారిపోవడంతో చుట్టూ పక్కల ఎంత గాలించినా ఆచూకీ లభించ లేదు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.క్రాంతి కుమార్ తెలిపారు.

దమ్ము చక్రాల దొంగలను పట్టుకోవాలి

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

తమ చావిళ్లలో భద్రపరచుకున్న దమ్ము చక్రాలను దొంగిలించిన వారిని పట్టుకోవాలని పలువుఉ రైతులు కోరారు. ఉండ్రాజవరంలో సంకురాత్రి సుబ్బారావుకు చెందిన దమ్ము చక్రాలు వెలగదుర్రు-తాటిపర్రు రోడ్డులో ఉన్న షెడ్డు నుండి, తాడిపర్రులో బొర్రా రామస్వామికి చెందిన దమ్ము చక్రాలు, పాలంగి దుర్గా గార్డెన్ వద్ద రాగు శ్రీనివాస్, కేతిన సుబ్బారావుకు చెందిన దమ్ము చక్రాలు శనివారం రాత్రి దొంగతనానికి గురైనట్టు తెలిపారు. ఆయా రైతులు అనుమానిత ప్రాంతాలను, తాడిపర్రు సెంటర్లో ఉన్న సిసి టీవీ ఫుటేజీలు పరిశీలించగా దొంగలు టాటా ఏస్ వాహనంలో టార్పాలిన్ కప్పి తీసుకుపోయినట్లు గుర్తించామన్నారు. వాహనం నెంబరు కనిపించలేదన్నారు. ఈ విషయమై ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి -కోరుకొండ

మండలంలోని నిడిగట్ల గ్రామశివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ శారదా సతీష్ తెలిపారు. మృతదేహంపై గాయాలను గుర్తించినట్లు తెలిపారు. మతుడు గ్రే కలర్ టీ షర్టు, నీలం ఎరుపు గళ్ల టవల్ ధరించి ఉన్నాడని, చనిపోయి రెండు మూడు రోజులై ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-రాజానగరం

నేటి ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వరకు సబ్ స్టేషన్ మరమ్మతుల కోసం రాజానగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఇఇ నక్కపల్లి సామ్యూల్ తెలిపారు. రాజానగరం మండలంలో రాజమండ్రి పేపర్ బోర్డ్, సూర్యారావుపేట, గైట్ కాలేజ్, జిఎస్ఎల్, నన్నయ యూనివర్సిటీ, బ్రిడ్జ్ కౌంటీకి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులందరూ సహకరించవలసినదిగా కోరారు.

వేలివెన్నులో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతులు తమ భూముల కచ్చితమైన డిజిటల్ రికార్డులను డ్రోన్ రీ సర్వే ద్వారా పొందవచ్చని జెడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య అన్నారు. గురువారం వేలివెన్నులో డ్రోన్ సర్వేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి ఎస్.జయలక్ష్మి, సర్వేయర్ వి.నాగేంద్రబాబు, టీమ్ ఇన్‌ఛార్జి జివిఎం.నాయుడు, గ్రామ సర్వేయర్లు, విఆర్ఒలు మురళి, ఏసుపాదం, శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆధార్ అన్నింటికీ ఆధారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రజలు నిర్వహించే అన్ని లావాదేవీలకు ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరి కనుక కచ్చితంగా ఆధార్ కార్డుల్లో సవరణలను ఉపయోగించుకోవాలని ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి అన్నారు. గురువారం పాలంగి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును ఆమె ప్రారంభించారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాలంటే ప్రజలంతా తమ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శరత్, గ్రామ కార్యదర్శి ఎండి హసన్ జానీ, పంచాయతీ సిబ్బంది రవీంద్ర, ఆధార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్లో 145 మంది

ప్రజాశక్తి-చాగల్లు

వివిధ కారణాలతో చదువు మధ్యలో ఆపిన వారికి తిరిగి ప్రభుత్వం కల్పించిన ఓపెన్ స్కూల్లో 145 మంది విద్యార్థులు పరీక్షలకు అర్హత సాధించినట్టు హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల్లో, ఇతర గ్రామాల్లో నుంచి కూడా ఓపెన్ స్కూల్లో పరీక్షలకు ఫీజులు కట్టినట్లు ఆయన తెలిపారు.

హైస్కూల్లో ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మూడు రోజులుగా పాఠశాల విద్యార్థులు 55 మందికి మార్పులు చేర్పులు చేసినట్టు పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని తమ పాఠశాల విద్యార్థులకు మంచి అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో వారికి చాలా ఉపయోగపడతాయని అన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కతికా శుక్లా

హాకీ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

-15 నుంచి కాకినాడలో 13వ జాతీయ మహిళా హాకీ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 15 నుంచి 26 వరకు జరగనున్న 13వ జాతీయ మహిళా హాకీ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయా లని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. హాకీ క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా రెవిన్యూ, నగరపాలక సంస్థ, జెఎన్‌టియు, వైద్య ఆరోగ్యం, సమాచార పౌర సంబంధాలు, పోలీస్, ట్రాన్స్‌పోర్ట్, విద్యా, రంగరాయ వైద్య కళాశాల, సెట్రాజ్, హాకీ క్రీడల కోఆర్డినేటర్ తదితరులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో హాకీ ఆంధ్రప్రదేశ్ సంఘం నిర్వహిస్తున్న 13వ జాతీయస్థాయి మహిళా హాకీ పోటీలకు కాకినాడ జిల్లా ఆతిథ్యం ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 15 నుంచి 26వరకు తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ హాకీ క్రీడా పోటీల్లో సుమారుగా 26 రాష్ట్రాల జట్లకు సంబంధించి సుమారు 600 మంది మహిళా క్రీడాకారులు, 50మంది హాకీ ఇండియా, మరో 40మంది ఇతర అతిథులు హాజరుకానున్నారన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా క్రీడా మైదానంలో పారిశుధ్య పనులు, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, నగరంలో హోర్డింగ్స్ ఏర్పాటు, గ్రౌండ్ చదును వంటి పనులను కాకినాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆరోగ్య శాఖకు సంబంధించి ప్రత్యేక వైద్య శిబిరం, ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖ సంబంధించి ప్రత్యేక బందోబస్తుతో పాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ కె.శ్రీధర్ రెడ్డి, రిజర్వుడ్ పోలీస్ అదనపు ఎస్పి బి. సత్యనారాయణ, జెఎన్‌టియుకె రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. సుమలత, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె రమేష్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం శాంతి ప్రభ, ఆర్ఎంపీ ప్రిన్సిపల్ డాక్టర్ నరసింహారావు, ఆర్‌టిఒ పీవి సాయిప్రసాద్, ఇన్‌చార్జ్ డిఇఒ ఆర్‌జె డానియల్ రాజ్, సెట్రాజ్ సీఈవో డీఎస్ సునీత, హాకీ ఇండియా కాంపిటీషన్ సీనియర్ మేనేజర్ విక్రమ్, హాకీ క్రీడా పోటీల కో-ఆర్డినేటర్ వి.రవిరాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీనివాసరావు, కాకినాడ ఆర్‌డిఒ బీవీ రమణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కొండపైన ప్రమాణ స్వీకారంచేస్తున్న నూతన పాలక మండలి సభ్యులు

రత్నగిరిపై నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం రత్నగిరి కొండపైన ఇటీవల ప్రభుత్వం కొత్తగా నియ మించిన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం కొండ పైన పరిపాలన కార్యాలయంలో దేవస్థానం ఎన్.వి.ఎస్.ఎన్ మూర్తి సమక్షంలో అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు సభ్యులందరితో ప్రమాణం చేయించారు. చైర్మన్ కాకుండా 14 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాల వలన కె.పోచమ్మ అనే సభ్యురాలు ఈ ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేకపోయారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో తాడి రజిని, కె.పశు వులరావు(దత్తుడు), దలే సూర్యనారాయణ, నక్కా అశ్విని, నెట్ల వెంకటలక్ష్మి, ఎస్.భూలక్ష్మి పేరూరి బద్రీ, నారాయణ, కేవీ నాగేశ్వర రావు, బి. విజయలక్ష్మి, డాక్టర్ నున్న నరసింహారావు, కడియాల లక్ష్మణరావు, కర్రీ బామిరెడ్డి ఉన్నారు.

హడావుడి లేకుండా ప్రమాణ స్వీకారానికి కారణం?

అయితే గతంలో కొత్తగా నియమించిన ట్రస్ట్ బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో తమ మంది మార్బలం తో వేలాదిమంది ని తీసుకొని వచ్చి ఎంతో అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేసేవారు. అయితే గురువారం ప్రమాణ స్వీకారం ఎటువంటి హడావుడి చేయకుండా నిరాడంబ రంగా చేయ డానికి కారణం, ఈ బోర్డు సభ్యులు కావడానికి కొంతమంది ఆశావహులు న్యాయ స్థానానికి వెళ్లి స్టేలు తెస్తారేమో నని భయం కూడా కారణం అవచ్చని ఈ సందర్భంగా మరి కొంతమంది ఆశావహులు నుండి వ్యాఖ్యానాలు విని పిస్తున్నాయి.

15న చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న ఈనెల, 15,16,17, తేదీల్లో జగ్గంపేట, పెద్దాపురం, అనపర్తి నియోజకవర్గాల్లో జరిగే ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఆధ్వర్యంలో గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. యనమల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను వైసిపి పాలన నుంచి ప్రజలను గట్టెంకించడం ఒక్క తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడుకే సాధ్యం అని అన్నారు. ఎంఎల్ఎ చిన రాజప్ప, జగ్గంపేట, అనపర్తి ఇన్చార్జ్‌లు జ్యోతుల నెహ్రూ, పడాల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు యావత్ ప్రజానీ కానికి పిలుపునిచ్చారు సమావేశంలో ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎంఎల్‌సి, శాసన మండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆదిరెడ్డి అప్పా రావు, కాకినాడ జిల్లా పార్టీ ఇన్చార్జ్ బండారు సత్యనారాయణమూర్తి, రాజమండ్రి పార్లమెంటు అధ్యక్షుడు కెఎస్ జవహర్, మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, గన్ని కృష్ణ తదితర నాయకులు చంద్రబాబు పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో పిల్లి సత్తిబాబు, రామదేవు సీతయ్య దొర, పార్టీ అధికార ప్రతినిధి మోకా ఆనంద్ సాగర్, వాసిరెడ్డి ఏసుదాసు, పేరాబత్తుల రాజశేఖర్, పెంకే శ్రీనివాస్ బాబా పాల్గొన్నారు సమావేశం అనంతరం ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నెల 24న ఏలూరులో కేవలం టిడిపి కార్యకర్తలతో మాత్రమే చంద్రబాబు సమావేశం ఉందని బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు.



మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు



పీఠాన్ని దర్శించుకున్న ఎంఎల్ఎ దొరబాబు, ప్రజాప్రతినిధులు

ప్రారంభమైన 95వ వార్షిక మహా జ్ఞాన సభలు

ప్రజాశక్తి - పిఠాపురం:

చిత్రాడ రైల్వే ఫ్లై ఓవర్ వద్దఉన్న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగే పీఠం 95వ వార్షిక మహా జ్ఞాన సభలను గురువారం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆలీషా మాట్లాడుతూ కష్టాన్ని ఇష్టపడి స్వీకరిస్తే భ్రాంతి శక్తి తొలగిపోతుందని తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ పెండెం దొరబాబు మాట్లాడుతూ శతాబ్దకాలంగా విశ్వమానవ శ్రేయస్సుకై పాటుపడుతున్న పీఠం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం అని అన్నారు. ఈ సందర్భంగా శ్రమ ప్రాంగణంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం పాలకేంద్రం, శిశు సంరక్షణా కేంద్రాలను, ప్రాథమిక వైద్య శిబిరాలతో పాటుగా 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పీఠాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొన్న 18 మంది దంపతులు, శివన్నారాయణ, వేద పండితులు

పత్తిగొందిలో విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు మండలం పి. మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహాలను పున్ణ ప్రతిష్ఠించారు. గత 3 రోజుల గా ఆలయ ప్రాంగణంలో వేద పండితులు సుదర్శన్ వెంకట జనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 8:51 గంటలకు సీతారామ లక్ష్మణ, ఆంజనేయ విగ్రహలను, చిట్టూరి కలికిమూర్తి, నాగమణి దంపతులు, వినాయక విగ్రహాన్ని జిత్తుగ వెంకటేశ్వరరావు, లక్ష్మీ దంపతులు, బాల దుర్గా విగ్రహాన్ని కడలి శ్రీనివాస్, కవితా దంపతులు ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త కుడు పూడి శివన్నారాయణతో పాటు 18 మంది దంపతులు పీటలపై కూర్చుని మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారామ కళ్యాణం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగ ణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ సమస్యల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-రాజానగరం

నియోజకవర్గంలో విద్యుత్ సమస్య లేకుండాలని విద్యుత్ సబ్-స్టేషన్ల నిర్మిస్తున్నామని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాధేయపాలెంలో రూ.2.8 కోట్ల, వెలుగుబంద జగనన్న కాలనీలో రూ.5 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మరో ఐదారు ప్రాంతాల్లో ఉప కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదించామని, త్వరలో అనుమతులు, నిధులు మంజూరై పనులు ప్రారంభించాలని ఇపిడిసిఎల్ అధికారులను కోరామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన సబ్-స్టేషన్లలో పనులు పూర్తయ్యి విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. వెలుగుబందలో 11,719 గృహాలకు విద్యుత్ అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వాసంశెట్టి పెద వెంకన్న, మండల కన్వీనర్ దూలం పెద్ద, ఎంపిపి మందారపు వీర్రాజు, సీతారత్నం, మందారపు వీర్రాజు, గండి నానిబాబు, కొలపాటి వెంకన్న, ప్రగాడ గోవిందు, నాతిబోయిన రాంబాబు, నురుకుర్తి దుర్గాశ్రీనివాస్, విద్యుత్ శాఖ అధికారులు ఎస్ఇ టివిఎస్ఎన్.మూర్తి, ఇఇ శామ్యూల్, ఎడిఇ నటరాజన్, ఎఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలను మద్దతుదారులుగా మార్చుకోవాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రరం

గడపగడపకు వెళ్ళి జగనన్న సంక్షేమ పథకాల ద్వారా ఎవరికి ఎటువంటి లబ్ధి చేకూరిందో వివరించి ప్రజలందరినీ మద్దతుదారులుగా మార్చుకోవాలని ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో గురువారం మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. నాలుగేళ్లుగా నిరంతరం వివిధ సంక్షేమ పథకాలతో ప్రజలందరికీ లబ్ధిచేకూర్చిన నేపథ్యంలో ఇంటింటా 'మా నమ్మకం నువ్వే జగనన్న' నినాదం ప్రతిధ్వనించేలా గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని ఎంఎల్ఏ రాజా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్రి నాగేశ్వరరావు, అడపా కనకరాజు, గణేశుల పోశియ్య, ఉల్లి బుజ్జిబాబు, కళ్యాణ రాంబాబు, కడియాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు గురువారం ప్రత్తిపాడు టిడిపి ఇన్చార్జ్ పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద ట్రస్ట్ గత 16 నెలలుగా ప్రతినెల 9వ తేదీన గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మెరుగైన సేవలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజలు, పారిశుధ్య సిబ్బంది, సమష్టి సహకారంతోనే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమని కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. గురువారం ఆయన కాకినాడ ఏడో డివిజన్ పరిధిలోని పద్మనాభనగర్‌లో ఇంటింటికి చెత్త సేకరణ, తడి పొడి చెత్తను విభజించి ఇస్తున్న తీరును పర్యవేక్షించారు. ప్రజల భాగస్వామ్యం పై మరింత అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే కాకినాడ నగరాన్ని సుందరంగా, క్లీన్ సిటీగా, ఉంచగలమని స్పష్టం చేశారు. సిబ్బంది ఈ అంశాలన ప్రజలకు వివరించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్,సిబ్బంది ఉన్నారు.

ఉచితంగా ఎలకల మందు పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు, ఉండ్రాజవరం

మండలంలోని చిక్కాల గ్రామంలో గురువారం రైతులందరికీ ఉచితంగా వ్యవసాయ శాఖ నుంచి ఎలుకల మందు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డిడిఎ బోసుబాబు, ఎడిఎ ఎవిఎస్.రంగారావు, నరసింహారావు, ఎడిఎ చంద్రశేఖర్ సహాయకులు రైతులు పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మీసాల విశ్వాసరావు సిబ్బందికి, రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. బ్రోమోడయోలిన్ ఎలుకల మందు మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రం వద్దా ఉచితంగా పొందవచ్చున్నారు.

వైఎస్ఆర్ బీమా సొమ్ము మంజూరు

ప్రజాశక్తి- గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో మూడో వార్డుకు చెందిన చల్లపల్లి చిన్నారావు ఇటీవల మరణించడంతో ఆయన వైఎస్ఆర్ బీమా రూ.లక్ష మంజూరైనట్టు ఎంపిపి సుంకర శ్రీవల్లి వీరబాబు తెలిపారు. గురువారం మట్టి ఖర్చులు నిమిత్తం చిన్నారావు భార్య నాగమణికి ఎంపిపి రూ.10 వేల అందజేశారు మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాకు జమ చేస్తారరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జరపు శ్రీనివాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పుట్టిన రోజు సందర్భంగా తాళ్ళరేవు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్ పేషెంట్లుతో పాటు ఇతర రోగులకు పండ్లు రొట్టెలు అందిం చారు. మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు టేకు మూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకట రమణ, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు,రోళ్ల చక్రవర్తి, కట్టా త్రిమూర్తులు, వెంటపల్లి ఉమామహేశ్వరి, మల్లాడి వరదరాజు, సి. హెచ్.సి.వైద్యురాలు శిరీష పాల్గొన్నారు.

సామర్లకోట పురపాలక సంఘం
ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఒ.సి. నెం. 943/2022-ఇ1, తేది.09-02-2023

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

సామర్లకోట పురపాలక సంఘం జిజిఎమ్‌పి, 15వ ఆర్థిక సంఘ అన్‌టైడ్ నిధులు (2020-21) (2వ విడత) మరియు జనరల్ నిధులతో ఎస్టిమేట్ కాంట్రాక్టు విలువ రూ. 166.54 లక్షలతో 44 పనులను చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి.

1. షెడ్యూల్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : ది.10-02-2023 ఉదయం గం|| 10.30ల నుండి
2. టెండర్లు స్వీకరణకు ముగింపు తేది : (ఎ) ది.20-02-2023 సాయంత్రం గం|| 4.30ల వరకు (7 వర్కులకు)
   (బి) ది.28-02-2023 సాయంత్రం గం|| 4.30ల వరకు (37 వర్కులకు)

తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in నందు e ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ వెబ్‌సైట్ నందు పొందవచ్చు.

సం/- **కమిషనరు,** సామర్లకోట పురపాలక సంఘం

In The Court Of The Prl. Senior Civil Judge :: Eluru
F.D.I.A.No. 1350/2018
O.S.No. 377/2015

Between:
Annamreddy Visvanadham ...*Petitioner /Plaintiff*
AND
Nakka Paul Krupavaram (Died) and Others ...*Respondents /Defendants*

TO:
R-2: Nakka Anuradha, W/o. Late Nakka Paul Krupavaram.
R-3: Nakka Spandana, D/o. -do-
R-4: Nakka Kalpana, D/o. -do-
R-5: Nakka Sindhuri, D/o. -do-
R-6: Nakka Vamsi Kishore, S/o. -do-, Above Parties D.No. 46-15-29/A, Danavaipeta, Rajahmundry City, E.G.District, RJCJC.

కోర్టు ప్రకటన

పై నెంబరు గల పిటీషనరు శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం ఆర్2 టు ఆర్6 లకు ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినా పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్‌కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు ఎదుట **ది.21-02-2023వ తేదీ ఉదయం గం|| 10:30 ని||లకు హాజరు కావలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

NEKKARAGANTI NARASIMHA RAO
Eluru, Advocate for Petitioner / Plaintiff,
30-01-23. Ashok Nagar, Eluru.

ప్రకటన

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 678/22, I.A. 530/2007
O.S. 436/2004

Between:
కట్టా వీర వెంకట ఉమామహేశ్వరరావు -పిటీషనరు
మరియు
గల్లా శ్రీదేవి -4వ రెస్పాండెంటు

ప్రతివాది: గల్లా శ్రీదేవి, W/o. వెంకన్నబాబు, 38 సం||లు, D.No. 33-9-4/A, మంగళవారపుపేట, రంభ థియేటరు ప్రక్కన, రాజమహేంద్రవరం.

సదరు పై నెంబరు గ్రంథమున మీరు కోర్టు వారు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను అమలు కానందున, కోర్టు వారు నోటీసు ప్రకారం మీరు **ది. 28-2-2023వ తేదీన ఉదయం 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు కావలయును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

K.T.V.R.SWARNA LATHA
R.RADHA KRISHNA
Advocates, D.No. 74-9-5
Rajahmundry Prakash Nagar
09-2-2023 Rajahmundry

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో, అమలాపురం
I.A. No. 268/2022, I.A. 269/2022
I.A. 270/2022, I.A. 271/2022
in O.S. No. 66/2016

Between:
వాసంశెట్టి శివశంకరరావు -పిటీషనరు/వాది
మరియు
చిలకలపూడి రామమోహనరావు (died) and Others -రెస్పాండెంట్లు

To:
R-2: చిలకలపూడి చంద్రకాంతం, 62 సం||లు, W/o. late రామమోహనరావు, Quarter No. C/4, కోర్టు కాంపౌండ్ కాలనీ, కాకినాడ, కాకినాడ జిల్లా.
R-3: చిలకలపూడి సురేష్‌కుమార్, 42 సం||లు, S/o. late రామమోహనరావు, -డిటో-
R-4: చిలకలపూడి దుర్గేశ్వరరావు, 39 సం||లు, S/o. late రామమోహనరావు, -డిటో-
R-5: చిలకలపూడి నాగరాజు, 36 సం||లు, S/o. late రామమోహనరావు, -డిటో-

పై నెంబరు కేసులో వాది గారు మొదటి ప్రతివాది గారైన చిలకలపూడి రామమోహనరావు గారిపై వేసిన దావాలో సదరు రామమోహనరావు గారు మరణించిన దర్మిలా వారసులైన మీలో 2వ రెస్పాండెంట్ భార్య గారు, 3 to 5 రెస్పాండెంట్లు కుమార్లుగాను అయియుండి, సదరు వాదిగారు పై నెంబరు కేసులో మిమ్ములను వారసులుగా/ప్రతివాద్లుగా చేర్చమని పిటీషన్లు దాఖలు చేయగా I.A. 268/2022 రు U/S Section 5 Limitation Act పిటీషనులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకోనందున మీకు యీ పబ్లికేషను ద్వారా నోటీసు యిస్తూ సదరు పై నెంబరు పిటిషను వాయిదా **ది. 16-2-2023వ తేదీ ఉదయం 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు వారి ఎదుట తెలుపుకోవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడును.

NALLA RAVI PRASAD
అమలాపురం Advocate & Notary
ది.4-2-2023 Amalapuram

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.ఎ.నెం:22/2021 ఇన్ ఇ.పి.నెం:206/2018
ఇన్ ఒ.యస్. నెం: 262/ 2017

బిట్వీన్:
తెలనాగుల వెంకట శివ లక్ష్మినారాయణ ...పిటీషనరు/ డి.హెచ్.ఆర్.
మరియు
సలాం బాలాజీ సింగ్(డైడ్) వగైరాలు ...రెస్పాండెంట్స్/ జె.డి.ఆర్స్

టు,
R-2/JDR No-2. సలాం అరుణబాయి, భర్త.లేటు బాలాజీ సింగ్
R-3/JDR No-3. సలాం శ్రీరామ్, తండ్రి.లేటు బాలాజీ సింగ్,
R-4/JDR No-4 సలాం భాను బాయి,తండ్రి.లేటు బాలాజీ సింగ్,అందరి నివాసం: డోర్‌నెం:130, ఆరోగ్య కమ్యూనిటీ సెంటర్ దగ్గర, నిడదవోలు పోస్టు, తూర్పు గోదావరి జిల్లా.

పై నెంబరు ఇ.పి.లోని ఇ.ఎ. నెం:22/2021 L.R's పిటీషనులో 5వ రెస్పాండెంట్స్/ జె.డి.ఆర్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా,సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 15-02-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:15-02-2023

సి.నరేంద్ర బాబు,
పిటీషనరు/డి.హెచ్.ఆర్ తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్:92464 85115

IN THE COURT OF HON'BLE II ADDI CHIEF JUDGE COURT CITI CIVIL COURT AT :: HYDERABAD
O.P.NO.2455 OF 2019

BETWEEN:
S.Pulamma and Others. ...Petitioner
AND
Jana Suresh Babu and and others ...Respondent.

To,
1.Jana Suresh Babu,S/o.Venkat Rao,Occ:Owner of the Ashok Leland Bus Bearing No.AP TF 0022, R/o.H.No.84-11-9/4, V.L.Puram Rajamandury,Urban,East Godavari,Rajamandry ...R1
2.Md.K.A.Sharif,S/o.ISAK Sharif, Occ: Driver,R/o.H.No.1-242, Masjid Street,Gowripatnam, Devarapalli West Godavary. ...R2

Take Notice that the above OP is filed against you and others for grant of Compensassion the Hon'ble court posted above case on 22-02-2023 at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.

(BY ORDER OF COURT)

M/s.A.Madhava Reddy,
Advocate
H.No.16-2-740/75/16,
Gaddiannaram,Hyderabad.

మహారాజశ్రీ కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 7/2018
in O.S.No. 106/2016

బిట్వీన్:
వల్లభని శ్రీహరి ...*డిక్రీ హోల్డర్ (డి. హెచ్.ఆర్)*
అండ్
శ్రీమతి జొన్నకూటి మీనాక్షి వగైరా ...*జె.డి.ఆర్స్*

పై నెంబరు ఇ.పి.లో డిక్రీ హోల్డర్ తన బాకీ రాబట్టుకొను నిమిత్తం ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది.01-03-2023వ తేదీ ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టులో వేలం వేయుదురు.** ఆసక్తి ఉన్న వారు వేలములో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు డిక్రీ హోల్డర్ తరుపున ప్లీడరు గారిని కాని, కోర్టు అమీనా గారిని కానీ సంప్రదించవచ్చును.

SCHEDULE

తూర్పు గోదావరి జిల్లా (పాత పశ్చిమ గోదావరి జిల్లా) వేగేశ్వరపురం, ఎస్.ఆర్.ఓ. తాళ్ళపూడి మండలం, తాళ్ళపూడి పంచాయితీ లిమిట్స్, కుక్కునూరు రెవిన్యూ లిమిట్స్, R.S.No. 17/3, an extent of 285 Sq. Yards of site together with RCC Building (Uncompleted Building) bounded on:
East: Vacant Site of Munjeti People. ***South:*** Vacant Site of Sai Sunkara Real Estate Banka Prasad. ***West:*** Sandu. ***North:*** Munjeti Nageswara Rao.

పై హద్దుల మధ్య గల R.S.No. 17/3 an extent of 285 Sq. Yards of site with RCC Building (Uncompleted Building) with all easements, electrical services and other rights thereto.

డిక్రీ హోల్డర్ విలువ : రూ.3,00,000/-
అమీనా విలువ : రూ.16,00,000/-
వేలం తేదీ: 01-03-2023

ఆత్కూరి సత్యనారాయణ
కొవ్వూరు, డిక్రీ హోల్డర్ తరుపు అడ్వకేట్,
03-2-23. కొవ్వూరు.